## డిచ్‌పల్లి పాఠశాలలో గ్రంథాలయ పరిశీలన



పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5 : డిచ్‌పల్లి పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి.. టీయూ వీసీ యాదగిరిరావుతో కలిసి బుధవారం పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణ తీరును పరిశీలించి, హెచ్‌ఎం సీతయ్యను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సూపర్‌బ్రెయిన్ యోగాపై అవగాహన



యోగాపై అవగాహన కల్పిస్తున్న అందె జీవన్‌రావు

రెంజల్, ఫిబ్రవరి 5: మండలంలోని దూపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సూపర్‌బ్రెయిన్ యోగాపై రాష్ట్ర అవార్డు గ్రహీత, గుంజీళ్ల మాస్టర్ అందె జీవన్‌రావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుంజీళ్లు తీయడం అనేది పాశ్చాత్యదేశాల్లో సూపర్‌బ్రెయిన్ యోగా అనే ఆధునిక పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. సూపర్ బ్రెయిన్ యోగా చేయడం ద్వారా మెదడు చురుకుదనం పెరిగి జ్ఞాపక శక్తి మెరుగు పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చందూరు రోడ్డుకు మోక్షమెప్పుడో?

- గుంతలమయంగా రోడ్డు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



గుంతల మయంగా చందూర్ – లక్ష్మాపూర్ రోడ్డు

చందూర్, ఫిబ్రవరి 5 : చందూర్ బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లే (చందూర్–లక్ష్మాపూర్) రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. చందూర్ మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే వారు ఈ రోడ్డు మీదుగా పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తారు. గుంతల రోడ్డు కారణంగా రోడ్డుపై ప్రయాణంలో తరుచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతూ దవాఖానల పాలవుతున్నారు. చాలాకాలంగా ఈ రోడ్డును అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్డు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చందూర్ నుంచి జలాల్‌పూర్ వరకు రూ.16 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అధికారులు కొలతలు చేపట్టడంతో గ్రామస్తులు సంబురపడ్డారు. కానీ అసెంబ్లీ ఎన్నికలు రావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఎన్నికలు గడిచి సంవత్సరం దాటినా నేటికీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. నిత్యం ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ప్రయాణించడంతో రోడ్డు మరింత గుంతలమయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించడంతోపాటు నూతన రోడ్డును నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కుళాయి పన్ను చెల్లించాలి

- డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్



కుళాయి పన్ను చెల్లించని ఇంటి నల్ల కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

కంఠేశ్వర్, ఫిబ్రవరి 5 : నగర వాసులు కుళాయి పన్ను చెల్లించాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ కోరారు. నగరంలోని నీటి పన్ను చెల్లించని పలు ఇండ్ల నల్లా కనెక్షన్లను బుధవారం తొలగించారు. నీటి పన్ను చెల్లించకుంటే సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు.

## రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొన్న వారికి అభినందన

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5 : దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 26న నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న టీయూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగానికి చెందిన వలంటీర్ జై తరుణ్, తెలంగాణ కాంటింజెంట్ లీడర్ డాక్టర్ ఎం.సునీతను టీయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి బుధవారం అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఆచార్య రవీందర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్వప్న, జూనియర్ అసిస్టెంట్ సురేశ్ పాల్గొన్నారు.



పరేడ్‌లో పాల్గొన్న వారిని అభినందిస్తున్న వీసీ యాదగిరిరావు

## 'బేటీ బచావో- బేటీ పడావో'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత

ధర్పల్లి, ఫిబ్రవరి 5 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'బేటీ బచావో – బేటీ పడావో' కార్యక్రమంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత మాట్లాడుతూ.. ఆడపిల్లలు తమ హక్కులు తెలుసుకుని, ఉన్నత విద్యనభ్యసిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. బాలల హక్కులు, సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. విద్యార్థినులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'రేషన్‌షాపులు ఏకకాలంలో తెరిచి ఉంచాలి'



తహసీల్దా శాంతకు వినతిపత్రం అందజేస్తున్న చందూర్ యువకులు

చందూర్, ఫిబ్రవరి 5 : చందూర్‌లోని రేషన్ దుకాణాలు ఏకకాలంలో తెరిచి ఉంచేలా చూడాలని కోరుతూ తహసీల్దార్ శాంతకు గ్రామ యువకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. చందూర్ మండల కేంద్రంలో రెండు రేషన్ దుకాణాలు, ఘన్‌పూర్‌లో మరో రేషన్ దుకాణాన్ని ఒకే వ్యక్తి నడుపుతున్నాడని ఆరోపించారు. చందూర్‌లోని రెండు రేషన్‌షాపులు ఏకకాలంలో తెరిచి ఉంచకుండా ఒక రేషన్ షాపులో కొన్ని రోజులు, మరో రేషన్‌షాపులో మరి కొన్ని రోజులు రేషన్ ఇస్తుండడంతో పెద్ద పంచాయతీగా ఉన్న చందూర్ గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

## సెంట్రల్ లైటింగ్, స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని ఫిర్యాదు

చందూర్, ఫిబ్రవరి 5 : మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై సెంట్రల్ లైటింగ్, స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని గ్రామ యువకులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారం రోజులుగా వీధిదీపాలు వెలగకపోవడంతో గ్రామంలోకి వెళ్లే రోడ్డు చీకటిగా ఉంటుందని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

**హంగర్గాలోని బీసీ కాలనీ చౌరస్తా వద్ద..**

పోతంగల్, ఫిబ్రవరి 5 : మండలంలోని హంగర్గా (ఎం) గ్రామం ఆబాది బీసీ కాలనీ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వీధి దీపాలు కొన్ని నెలలుగా వెలగడం లేదు. దీంతో స్థానికులతో పాటు గ్రామంలో శుభకార్యాలు నిర్వహించుకునే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి చీకట్లో రోడ్డు ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం



తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మోస్రా రెడ్డి సంఘం సభ్యులు

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 5 : మోస్రా మండలకేంద్రంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. వరంగల్‌లో రెడ్డి కులస్తులపై ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

## బోరు మోటరుకు మరమ్మతులు



బోరు మోటారుకు మరమ్మతులు చేసిన సిబ్బంది

సారంగాపూర్, ఫిబ్రవరి 5 : నగర శివారులోని సారంగాపూర్ గ్రామంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని పెద్ద వాటర్‌ట్యాంక్, మినీ వాటర్ ట్యాంక్‌కు నీరు సరఫరా చేసే బోరుమోటారు చెడిపోయింది. దీంతో పలు కాలనీల్లో తాగునీటి సమస్య నెలకొన్నది. ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ అక్బర్ నవాజుద్దీన్, రాజు, అఫ్సర్ ఇటీవల సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది మరమ్మతులు కాలయాపన చేస్తూ వచ్చారు. నిర్లక్ష్యం వహిస్తే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన చేస్తామని సదరు నాయకులు హెచ్చరించడంతో స్పందించిన అధికారులు సిబ్బందితో నూతన పంప్ మోటరును ఏర్పాటు చేసి, నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. రెండు వారాల పాటు ఎదుర్కొన్న తాగునీటి సమస్య తొలగిపోవటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## నులి పురుగులు, కుష్ఠ వ్యాధి నివారణపై అవగాహన

సిరికొండ, ఫిబ్రవరి 5 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు వ్యాధులపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. సిరికొండ పీహెచ్‌సీ డాక్టర్ అరవింద్ జాతీయ నులి పురుగుల నివారణ, కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. చర్మంపై నొప్పి లేని గోధుమ రంగు మచ్చలు ఉంటే వెంటనే పీహెచ్‌సీలో చూపించుకోవాలని అన్నారు. నులిపురుగుల నివారణ కోసం ఈనెల10 న అందజేసే అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. అనంతరం కుష్ఠు వ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం స్వరూప, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

## మాదిగ సంఘాల సంబురాలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి5: ఎస్సీ వర్గీకరణకు శాసన సభ ఆమోదం తెలిపిన సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వివిధ మాదిగలు, ఉపకులాల సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు తినిపించుకున్నారు. మాదిగ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మోతే భూమన్న మాట్లాడుతూ మాదిగల ఎన్నో ఏండ్ల కల నెరవేరిందని అన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## బోధన్‌లో మహా రక్తదాన శిబిరం



మహా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బోధన్, జనవరి 5: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఆరోగ్యజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. 192 మంది దాతలు రక్తదానం చేశారు. బ్లడ్ క్యాన్సర్ రోగుల కోసం ఈ రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలకు వచ్చే పేద రోగుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆరోగ్యజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఆరోగ్య జ్యోతి విజ్ఞప్తి మేరకు రక్తదానం చేసేందుకు పలువురు తరలివచ్చారు. శిబిరంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఆరోగ్య జ్యోతి, జిల్లా హెల్త్ సర్వీసెస్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ ప్రసాద్, వైద్యాధికారులు రాహుల్, రహీం, సుజిత్, బోధన్ ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి సుమంత్, వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు పి.రవికిరణ్, బాలగంగాధర్‌రావు, పల్లెంపాటి శివన్నారాయణ, ఐఆర్ చక్రవర్తి, పాపారావు, పి.గాంధీ, వేములపల్లి బుజ్జి పాల్గొన్నారు.

## అవగాహన సదస్సు

మాక్లూర్, ఫిబ్రవరి 5: మండలంలోని కిట్స్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ముఖిద్‌పాషా, ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. మ్యాకింగ్ అనుమతి లేకుండా డేటా లేదా కంప్యూటర్ వ్యవస్థలోకి ప్రవేశించడం, ఫిషింగ్, ఈమెయిల్ మోసాలు, వ్యక్తిగత సమాచారం దొంగలించేందుకు మోసపూరిత ఈమెయిళ్లు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.


# పూర్వ విద్యార్థుల 'గురుదక్షిణ'




పాఠశాలకు స్మార్ట్‌టీవీ, సౌండ్‌బాక్స్‌ను అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

మోర్తాడ్, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో బుధవారం గురుదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పాఠశాల హెచ్‌ఎం బాలరాజు మొదటి పోస్టింగ్ గాంధారి మండలం పేట్‌సంగం ఉన్నత పాఠశాలలో పనిచేశారు. అప్పటి ఆయన శిష్యులు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా వారు వారి గురువు బాలరాజు పనిచేస్తున్న మోర్తాడ్ బాలికల ప్రాథమిక పాఠశాలకు గురుదక్షిణగా స్మార్ట్‌టీవీ, సౌండ్ బాక్స్‌ను అందజేశారు. పూర్వవిద్యార్థులను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో రమణాచారి, సాగర్, నరసింహమూర్తి, రమేశ్, శంకర్, భూమేశ్వర్, బాలార్జునగౌడ్, దాతలు విఠల్, రామాగౌడ్, గణేశ్, నరేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మోటర్లకు కెపాసిటర్లు అమర్చాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోధన్ రూరల్, ఫిబ్రవరి5: వ్యవసాయ మోటర్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ రమేశ్ అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని ఊట్‌పల్లి శివారులో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. విద్యుత్ మోటర్లు సక్రమంగా పని చేయాలన్నా, విద్యుత్‌ను ఆదా చేయాలన్నా కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద లోపం ఉంటే విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్, ఏఈ మారుతి జాదవ్, ఎల్‌ఐ శివప్రసాద్, లైన్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు

నవీపేట, ఫిబ్రవరి 5: ప్రతి విద్యార్థి సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కోయోడి నర్సింహులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మారు మూల గ్రామాల్లో నేటికీ మూఢ నమ్మకాలతో కుటుంబాలు ఇబ్బందుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకొని మూఢ నమ్మకాలను పారదోలేందుకు కృషి చేయాలని సూచించారు. ఈనెల 28న మండల కేంద్రంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు వివిధ రకాల వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు శ్రీరాంగౌడ్, లక్ష్మణ్‌రాజ్, డాక్టర్ కిషన్, రాజశేఖర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

నవీపేట, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం జీపీ కార్యదర్శి రవీందర్ నాయక్‌కు స్థానికులు వినతి పత్రాన్ని అందజేశారు. కొన్ని నెలలుగా మండల కేంద్రంలో దోమల బెడదతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. దోమల మందును పిచికారీ చేయాలని కోరారు.

## ఆహార పదార్థాల కల్తీని గుర్తించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 5: ఆహార పదార్థాల కల్తీ రోజురోజుకూ పెరిగిపోతున్నదని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆహార కల్తీ, అయోడిన్ ఉప్పులో ప్లాస్టిక్ అంశంపై బుధవారం చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడారు. వినియోగదారులు చైతన్యవంతులు కావాలని సూచించారు.

## మహిళలు సంఘాల్లో చేరాలి

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 5: బోధన్ పట్టణంలో నూతన మహిళా సంఘాల ఏర్పాటుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డుల వారీగా ఈనెల 15వ తేదీ వరకు మహిళా సంఘాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. 18 నుంచి 59 ఏండ్ల లోపు వయస్సు ఉన్న మహిళలను సంఘంలో చేర్పించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహిళలు సంఘాల్లో చేరి పొదుపులు చేస్తూ, రుణాలు పొందుతూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

## పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి5: పట్టణంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21,900 నగదు, ఐదు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

# విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం




విద్యార్థులకు నగదు అందజేస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 5: బోధన్ పట్టణంలోని విద్యావికాస్ కళాశాల విద్యార్థులకు బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నగదు పారితోషికాన్ని అందజేశారు. గత నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా బోధన్‌లో ఏర్పాటు చేసిన 101 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణలో విద్యావికాస్ కళాశాలకు చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శన, దేశభక్తిపై చేసిన ప్రసంగాలకు ఆయన మెచ్చుకొని వారికి నగదు బహుమతి అందజేస్తానని ఆరోజు హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో రూ.1.10లక్షల నగదు బహుమతిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, విద్యావికాస్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ వై. శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్

ఎడపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామంలో బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ కె.శ్రీనివాస్ బీఆర్‌ఎస్ మండల నాయకులతో కలిసి బుధవారం పరామర్శించారు. గత నెల 15న గ్రామానికి చెందిన చల్ల మహేందర్, నీలి నరేశ్ జార్ఖండ్ రాష్ట్రానికి బోర్‌వెల్‌పై కూలీలుగా వెళ్లారు. 20వ తేదీన రైలులో బయల్దేరినట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. వారు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్సీ కవితకు ఫోన్ ద్వారా సమాచారం అందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆమె సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాజా మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, వడ్డెన్న తదితరులు ఉన్నారు.

IN THE HIGH COURT FOR THE STATE OF TELANGANA, AT HYDERABAD
CRL,P.No. 5635 of 2023
Between:
Vanjari Shankar Pateri, S/o. Vanjari Gangaram,aged about 76 years, Occ: Retired Employee. Caste: Vanjari, R/o. H.No. 1-96, Bashirabad, Nizamabad, presently residing at House No. 11-1-1089, Chandrashekar Colony, Nizamabad. ...Petitioner
AND
1. The State of Telangana, Rep. by the Public Prosecutor, High Court For the State of Telangana, Hyderabad (through the Station House Officer, WPS, Nizamabad).
2. Smt. Vanjari Gangamani, W/o. V. Shankar, aged about 41 years, Caste: Vanjari, Occ: Housewife, R/o. House No. 11-1-1089, Chandrashekar Colony, Nizamabad. ...Respondents
My client, Vanjari Shankar Pateri filed Crl,P.No. 5635 of 2023 in the Hon'ble High Court of Telangan, to quash the proceedings in CC.No. 1836 of 2022, dated 30.11.2022, on the file the I Addl. Judicial First Class Magistrate, at Nizamabad. The Hon'ble High Court Court of Telangana was pleased to passed interim order by granting interim stay of all further proceedings vide order dt. 26.06.2023 in CC.No. 1836 of 2022, on the file the I Addl. Judicial First Class Magistrate, at Nizamabad. While pending the same the notices were served on the respondent No.2 and the same was returned as unclaimed. Thereafter the above said criminal petition was came up for extension of interim Orders granted on 26.06.2023 and The Hon'ble High Court was pleased to extended interim orders till 28.01.2025. While granting extension of interim orders the Hon'ble High Court of Telangana was also diretd the petitioner to issue notice under substityute of service by giving in paper publication. Therefore in view of the above slad circucumstaces this notice is issued to you for further information and the above Criminal Petition is posted to 25.02.2025, you are hereby attend on that day personally or through your advocate/Counsel. This notice is treated as substitute of service in the above said criminal petition.
**Sd/- C.Raja Shekar Reddy,** Advocate
Flat No. 102, Yamuna Blockm, Ganesh Nagar, Ramanthapur,Hyderabad-13 Mobile No. 9848593853.

## కమ్మర్‌పల్లి ప్రభుత్వ దవాఖాన తనిఖీ

మోర్తాడ్, ఫిబ్రవరి 5: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఎంపీడీవో రాజశ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. దవాఖాన పరిధిలోని గ్రామాల్లో ఎవరైనా డెంగ్యూ, చికెన్‌గున్యా, విష జ్వరాల బారిన పడ్డారా అని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ నర్సింహస్వామి మాట్లాడుతూ దవాఖాన పరిధిలో ఎలాంటి కేసులూ నమోదు కాలేదని చెప్పారు.

## పన్నుల వసూలు పూర్తి చేయాలి

మోర్తాడ్, ఫిబ్రవరి 5: గ్రామాల్లో మార్చి నెలాఖరు వరకు వంద శాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయంలో కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల జీపీ కార్యదర్శులకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీవో శ్రీధర్, సదాశివ్ పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

మాక్లూర్, ఫిబ్రవరి 5: మాదాపూర్‌లోని భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు బుధవారం ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ విద్యార్థులతో వ్యాయామాలు చేయించారు. రిసోర్స్‌పర్సన్ రమాదేవి మాట్లాడుతూ 18 ఏండ్ల లోపు బాలబాలికలకు ప్రతి బుధవారం ప్రాథమిక పాఠశాలలోని భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఉపాధ్యాయురాలికి సన్మానం

మోర్తాడ్, ఫిబ్రవరి 5: మోర్తాడ్ బాలికల పాఠశాలలో 2012 నుంచి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన సంధ్యారాణిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆంధ్రయ్య, సమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు బాలరాజు, ప్రభాకర్, రమణ, సాగర్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

వేల్పూర్, ఫిబ్రవరి 5: మండలంలోని జాన్కంపేట్ అంగన్‌వాడీ సెంటర్‌ను బుధవారం ఎంపీడీవో బాలకిషన్ తనిఖీ చేశారు. వంటసరుకులు, ఇతర వంటసామగ్రిని తనిఖీ చేసి పిల్లలకు నాణ్యమైన ఆహారమందించాలని టీచర్‌కు సూచించారు.

## వృక్షానికి మంటలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి5: మండలంలోని చేపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న వృక్షానికి ప్రమాదవశాత్తు మంగళవారం రాత్రి నిప్పు అంటుకుంది. స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

శక్కర్‌నగర్/కోటగిరి, ఫిబ్రవరి 5: బోధన్ పట్టణంలో మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి బోధన్ న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని పట్టణ సీఐ వెంకట నారాయణ బుధవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. బోధన్ మండలం హున్సా గ్రామానికి చెందిన కె.మధుకర్, బోధన్ పట్టణం బీటీనగర్‌కు చెందిన ఇంతియాజ్ ఇటీవల మద్య సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ వారిని బోధన్ కోర్టులో హాజరు పర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప శాయి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష పడినటుల కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకా ఆరుల్ గ్రామానికి చెందిన ఒకరు, కామారెడ్డి జిల్లా డోంగ్లీ గ్రామానికి చెందిన మరొకరు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా కేసు నమోదు చేసి, బోధన్ కోర్టులో బుధవారం హాజరుపర్చారు. ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ శేష తల్పసాయి తీర్పు చెప్పారని ఎస్సై తెలిపారు.